IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# ‘తండా’కు సాహిత్యంలో స్థానమిచ్చిన ‘నసాబ్’

* డా.జరుపుల రమేష్
హెడ్ & అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు శాఖ, ఎస్.ఆర్.& బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం.

తెలుగు సాహిత్యంలో తన స్థానాన్ని రికార్డు చేసుకున్న రచన ‘నసాబ్’. ఇప్పటిదాకా తెలుగు సాహిత్యంలో గిరినజనేతరులు రాసిన కవిత్వం రికార్డు అయింది. ఆ సాహిత్యాన్ని సానుభూతి సాహిత్యంగానే చూస్తున్నారు. ఆ క్రమంలో అస్తిత్వ గొంతుకతో వెలుగులోకి వచ్చిన కవిత్వం పంతులు నాయక్ రాసిన ‘నసాబ్’.

వైదిక మంత్రంలో కవిర్మనీషీ పరిభూ: స్వయంభూ: అని ఉంది.కవి శబ్దము పరమాత్మ అనే అర్థంలో కనిపిస్తుంది. అది క్రమంగా ‘ఋషి’ పరంగా చెప్పబడిరది. ‘నా ఋషి: కురుతే కావ్యమ్/ కవయ: క్రాంతి దర్శిన:..’ ఈ లోకోక్తులు కవి అంటే ఋషి అనే అర్థాన్ని సూచిస్తున్నాయి. తెలుగు లాక్షిణికుడు అప్పకవి కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించాడు. గ్రీకులు కూడా కవితాశక్తి దైవదత్తమని భావించారు. ప్లేటో కూడా తన ‘ఇయాన్’ అనే గ్రంథంలో ‘కవి ముఖత: పలుకునది భగవంతుడే’ అని అభిప్రాయపడ్డాడు. ఉన్నదాన్ని వర్ణించడమే కాదు నూతన సృష్టి చేసేందుకు సమర్థుడైన వాడు కవి. అందుకే గ్రీకులు కవిని పొయటెస్’ అన్నారు. పొయటెస్ అంటే సృష్టికర్త అనే అర్థం వస్తుంది. ‘అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి:/ యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే:’ అని ఆనందవర్ధనుని అభిప్రాయం.

కవికి వర్తమానమే కాదు, గతాన్ని, భవిష్యత్తును దర్శించే నేర్పు అవసరం. పంతులు నాయక్ ‘నసాబ్’ కవిత్వంలో ‘తాండా’ యొక్క భూత, భవిష్యత్, వర్తమానం, ఆగమాలను దర్శించాడు. వాస్తవానికి కవిత్వానికి నిన్న, రేపులు ఉండవు. సూర్యుని చూపువలె, తెమ్మెర వీవెన వలె ఇది అనంతము. ఒక కవి అన్నట్లు ‘కవిత్వమెంత పురాతనమైనవో అంత ఆధునాతనమైనది’ఆదిమ మానవుడి నుండి అణుయుగం దాకా కవి బతికే ఉంటాడు. మానవుడున్నంత కాలం మనిషిలో ఆలోచన, దృక్పథం గల్గినంత వరకూ కవిత్వం బతికే ఉంటుంది.

కవిత్వాన్ని ఎవరైనా రాయవచ్చా! లేదా కవులే రాయాలా! దీనికి హద్దులు, పరిమితులు ఏమైనా ఉంటాయి! అభివృద్ధి చెందిన కులాలు, మతాలకే వీటిలో స్థానం ఉంటుందా? అట్టడగు వర్గాల వారికి కూడా స్థానం ఉండదా? ఏ జీవితం ‘కవిత్వానికీ వస్తువు అవుతుంది? మొదలైన అనేక ప్రశ్నలకు ‘పంచాయితీ’ పెడుతూ ‘నసాబ్’ పేరుతో తెలుగులో దూసుకొచ్చిన కవిత్వం’ పంతులు నాయక్ నసాబ్. వాటికి సమాధానమే ఈ కవిత్వం.

కవిత్వం గురించి లాక్షణికులు రెండు వేల సంవత్సరాల పూర్వమే సిద్ధాంతీకరించి ఉన్నారు. ‘భరతడు కవిత్వం మృదు పదార్థములతో కూడుకొని ప్రసాద గుణమయంగా ఉండవలెనని’ అభిప్రాయం తెలిపాడు. ‘ఇతివర్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్’ అని అన్నాడు. భామహుడు ‘శబ్దార్థౌ సహితౌకావ్యమ్’ అని అన్నాడు. ‘కావ్యం రసాత్మకం కావ్యమ్’ అని విశ్వనాథుడు, ‘రమణీయార్థ ప్రతిపాదిక శబ్ద: కావ్యమ్’ అని జగన్నాథుడు అన్నారు.

'కవిత్వమంటే గాలిలో లేచిన అల కాదు. తెల్ల కాగితము మీద నల్లసిరా మరకలు కాదు. కవిత్వం రేఖలకు ధ్వనులకు అతీతమైన ఏదో ఒక అవ్యక్త శక్తి! అంటాడు బార్‌ఫీల్డ్. [illegible] అంటాడు మరో విమర్శకుడు. అనుభూతిని([illegible]), ఆవేశాన్ని ([illegible]) పురస్కరించుకొని [illegible] ఇలా నిర్వచించాడు. '[illegible]' అంటే తీవ్రానుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వం అని అర్థం. ఆంగ్ల విమర్శకులలో వర్డ్సువర్త్, మిల్, రస్కిన్ మొదలైన వారు కవిత్వమంటే 'ఆవేశోద్గమనమే' అన్నారు. షెల్లీ మొదలైనవారు 'ఊహా ప్రకటనమే' కవిత్వమన్నారు. ఆర్నాల్డు కవిత్వానికి 'వ్యక్తీకరణమే ప్రధానం' అన్నాడు. అమెరికా దేశపు రచయిత ఎడ్గర్ ఎలన్‌పో 'సౌందర్యం లయబద్ధమైన సృష్టియే కవిత్వం' అన్నాడు.

పై అనేక లక్షణాలు మేళవించుకొని 'నసాబ్' మన మధ్యలో 'పంచాయితీ' నిర్వహిస్తుంది. పంతులు నాయక్ పేద కుటుంబంలో పుట్టి, తాను చూసిన జీవితాన్ని, తాను అనుభవించిన సంఘటనలను సంభాషణలను తన మాటల రూపంలో మనమధ్య 'నసాబ్' గా మాట్లాడుతూ 'నసాబ్' కు విశ్వవేదిక స్థానాన్ని ఇచ్చాడు.

<u>'నసాబ్' కవిత్వ వస్తువు</u>

కవిత్వం ఒక ఫీలింగ్. దు:ఖానికి సంతోషానికి ఒక ప్రతి స్పందన. అయితే ఈ సుఖ దు:ఖాలు కొన్ని తక్షణ సంఘటనలను బట్టి కలగడమూ ఉంటుంది. దీర్ఘకాలం మన పేగును పట్టుకొని అట్లా కొనసాగుతూ వచ్చేవి కూడా సుఖ దు:ఖాలు ఉంటాయి. ఈ సుఖ దు:ఖాల తాత్విక అభివ్యక్తికి ఉండే భూమిక, కాన్వాస్ ఒకటే. అది చాలా పెద్దది. ఆయా సందర్భాల స్పందన వేరు. రెండు సందర్భాలలోనూ కాలవ్యవధిలో తేడా ఉండవచ్చు తప్ప గాఢమైన అనుభూతి లేకుండా చిన్న కవిత సాధ్యం కాదు. దీర్ఘ కవిత సాధ్యం కాదు' అని వరవరరావు అన్నారు.

కవి అంతర్మథనమే కవిత్వం. అయితే ఒక కవికి మరొక కవికి అభివ్యక్తి భిన్నంగా వుంటుంది. కొంతమంది కవిత్వంలో ఆక్రోశం, ఆర్తి, ఆవేదన అంతస్సారంగా వుంటే, ఇంకొందరి కవిత్వంలో చల్లని మలయ మారుతాలు, వెచ్చని ఒదార్పులు వుంటాయి. తీసుకున్న వస్తువు పట్ల ఒక నిబద్ధత, నిజాయితీ ప్రకటన కన్పిస్తుంది. తాను దర్శించిన వస్తువులను కవిత్వం చెయ్యడంలో తనదైన బలమైన ముద్ర వుంటుంది.

ఒక జాతి జీవనానికీ, ఆజాతి సంస్కృతికి అద్దంపట్టి తర తరాలకు అందించే మహత్తర శక్తి సాహిత్యానికుంది. అందులో కవిత్వానికి ఒక ప్రత్యేకత ఉంది. అది నిత్య చలనశీలమైంది. సజీవమైంది. చైతన్యవంతమై కవి కల్పనలో ఒదిగి నిత్య నూతనంగా భాసిల్లుతూనే ఉంటుంది.

'నసాబ్' కవిత్వం వస్తువు పరంగా ఒక గ్రామానికి లోబడి, అక్కడి నుండి విశ్వవ్యాప్తం చేసిన సందర్భాలు కనిపిస్తాయి. కవి కాలానికి ప్రతినిధి. ఎదుగుతున్న దశలో నడుస్తున్న కాలం వేసే బలమైన ముద్ర కవి జీవితమంతా విస్తరిస్తుంది. ఋతువులెన్ని మారుతున్నా, దృశ్యాలు ఎప్పటికప్పుడు కొత్తగా వికసిస్తున్నా, ఏనాడు ఈ దశలో వన్నె తగ్గని ప్రకృతి వంటి వాడు కవి. కాలమెంత వింతపోకడలు పోతుందో కవి అంత వినూత్న పోకడలతో విస్తరిస్తుంటాడు.

'మనసుపెట్టి పరిశీలిస్తే ప్రతి మనిషీ ఒక గ్రంథం' అని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారె అన్నారు. నసాబ్‌ని కూడా ఆ లోగిల్లోకి లాగుదాం. పంచాయితీని తెలుద్దాం. 'నీ రక్తం అడుగుతున్నది సంపన్నులనూ చట్టాలనూ కలిపి అల్లిందెవరు? ఏ గ్రంథక ఇనుపదారంతో ఆ ప్రవాహంలో పేదలెట్లా కొట్టుకుపోతున్నారు' అని పాబ్లో నెరుడా(ది జడ్జెస్ కవిత)లో అన్నట్లు తన జాతి సంతకాన్ని వస్తువుగా 'నసాబ్' లో తీసుకున్నాడు.

<u>నసాబ్ కవిత్వం – పరిశీలన</u>

ప్రశాంతంగా లోపలి వాణిని విందాం. అసలైన పిలుపుని అందుకుందాం. ఒక గొప్ప జీవితం జీవిద్దాం. ఈ ప్రపంచం గుర్తుంచుకునేది లోపలి పిలుపునందుకున్న నాయకులదే కానీ బయట పిలుపును బట్టి వృత్తి నెంచుకున్న వారిది కాదు. అఖండ విజయం సాధించడానికి కావల్సిన ప్రధాన అర్హత కవి చెప్పిన చైతన్యవంతమైన కవితా పంక్తులే అని విషయాన్ని గుర్తించాలి.

నసాబ్' లో మొత్తం ౩౭ కవితలు ఉన్నాయి. ప్రాణం లేని వస్తువులకు కవి ఈ కవితలో జీవం ఇచ్చి సుస్థిర స్థానాన్ని ఇచ్చాడు. బంజారాలు ఏ తండాలో వున్న వారి నిద్రావస్థను తట్టి మేల్కొలిపి

వారిని ఉత్తేజపరచాలని' ఈ పుస్తకం ముందుమాటలో కొర్ర జగన్నాథరావు అన్నారు. 'నసాబ్' కవితలను పరిశీలిస్తే...

**అస్తిత్వం తో కూడిన కవితలు:**

తిక్కగొర్రె:

'ముత్యాలమ్మ ఖాళియా ఒడ్డుకి/ గొర్ల మందల్ని తోలుకుపోయిన
ఒక గోర్లి తప్పిపోయింది/ నాయాల్ది తిక్క గొర్రెకి వాత పెట్టాల్సిందే
గుంపుతో కలవనంటది/గడ్డి యేయనంటది
దీని కన్నా బొల్లి గోర్లి నయం/యాడ ఉన్నా కనిపెట్టవచ్చు
కలవని గొర్రె ఎప్పటికైనా/ కంట్లో నలుసే
మన కటికోడు రాంచందర్‌కి చెప్పి/తోలు తీసి డబడా కొట్టాల్సిందే
వచ్చే మంగళవారం/కోటమైసమ్మ జాతరకి
తికాళి గొర్రెని బలి పెట్టాల్సిందే/ మేగ్యా తండా నాయక్ హరియాని
పిలవాల్సిందే' అంటూ చిత్రించాడు. సాధారణంగా బంజారాలే కాకుండా అన్ని కులాలు వారు, అన్ని జాతులు వారు కోట మైసమ్మ లేదా కట్ట మైసమ్మ పండుగ చేయడం సాధారణమే. కానీ ఈ కవితలో తిక్కగొర్రెని అని వ్యంగ్యాత్మకంగా చెప్పడంలో చాలా అర్థాలున్నాయి. గిరిజనులను ఈ సమాజం ఎలా అనుకుంటుందో చెప్పకనే చెప్పాడు కవి. వాళ్ళు చాలా నమ్మకస్తులని, ఒక్కసారి నమ్మితే ప్రాణం పోయేంతవరకు వదలరని తెలుసుకొని, మాట వినకపోతే మంగళవారం అశుభ దినం కాబట్టి కోటమైసమ్మకు బలి ఇవ్వడం అనే సూచికను చెప్పాడు. అశుభం అంటే నమ్మక ద్రోహం చేయడానికి అని.

'కలవనిగొర్రె' అని అనడంలో గిరిజనులు నాగరిక ప్రాంతంలో కాకుండా, అనాగరికంగా జనజీవన స్రవంతికి దూరంగా ఉండిపోతున్నారు. వారు మాత్రం జనజీవన ప్రాంతంలోకి రావడం లేదని సంకేతాన్నిచ్చాడు.

మరొక కవిత 'పసిపాప' ను పరిశీలిస్తే...

'సృష్టిలో అన్ని జంతువులు/తమ పిల్లల్ని ప్రేమిస్తాయి
పిట్టలు గడ్డిపోచలను/బంగారు తీగలుగా మార్చి
గూడును నిర్మించి గుడ్లు పెట్టి పొదుగుతుంది/ పిల్లలకు ఆహారం తెచ్చిపెడుతుంది
కాని మానవుడు/ తన ఆకలిని తీర్చుకోవడానికి
పసిపాపలను అమ్మేస్తుంటే/సభ్య సమాజం
హైటెక్ కంప్యూటర్ యుగమంటూ/ఫొటోలు తీసినా ప్రజానాయకులు
పట్టనట్లు పేపర్లో బొమ్మలు చూసీ చూడనట్లూ
స్త్రీ శిశు సంక్షేమం గొడ్రాలయినట్లు/లంబాడి అందాన్ని కొనుక్కోటానికి
ప్రపంచదేశాల ధనవంతులు /ఆశగా ఎదురు చూస్తున్నారు' అంటూ లంబాడీ స్త్రీల పట్ల సమాజానికి ఉన్న భావాన్ని ఈ కవితలో తెలియజేశాడు.సాధారణంగా లంబాడీ స్త్రీలు అంటే ఒకరకమైన అభిప్రాయం జనాల్లో దాగి ఉంది. దానికి అనేక కారణాలు. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అంశాల పరిధిలో దాన్ని చూడాల్సిన అవసరం ఉంది. గిరిజనులు సహజంగానే చాలా అందంగా ఉంటారు. ప్రపంచ పోటి మార్కెట్లో వాళ్ళను ప్రవేశపెడ్తే కిరీటం వారికే వర్తిస్తుంది. కానీ, స్త్రీలను వస్తువుగా చూడడం, అందులో గిరిజన స్త్రీ కేవలం ఒక మార్కెట్ వస్తువుగా చూడడం ఎక్కువగా కనిపిస్తుంది. చాణిక్యుడు అన్నట్లు 'స్త్రీ చాలా బలమైన వ్యక్తిత్వం కలిగి ఉంటుంది. కానీ కాలంలో దాన్ని ఉపయోగించుకునే తీరులో ఎక్కడో బలహీనమైంది' అన్నారు.

అందుకే ' తండాలో అంతా/ మంచి మొక్కలే మొలిచాయి/ కాని పక్క ఊరి నుండి/ గాలికి కొట్టుకొచ్చిన/ గంజాయి మొక్క/ మా తండాలో / చివరి ఇంటి దగ్గర మొలిచింది/ అతి తండా అంతా పాకే ప్రమాదం ఉంది/ దానికి పీకడానికి ఒక పావు సారా చల్లి/ కోట మైసమ్మకు / మేకపోతుని బలిచ్చి / ఇంటింటికి ఒక మనిషిని పిలిచి/ దావతు చేయాల్సిందే/ మొక్క మొక్కే/ గంజాయి గంజాయే?' అంటూ మొదటి దానికి కొనసాగింపు చేస్తాడు.

తండాలో ఎక్కువగా వారి పరిధిలో మాత్రమే ఏదైనా చేసుకుంటుంటారు. పరిధి దాటి వెళ్ళరు. వారే కాదు, గిరిజనులందరు వారి వారి పరిధిలో మాత్రమే ఉంటారు. నూతన ఆలోచన విధానాన్ని ఆదరించేవారిని నిర్మూలించడం పెద్ద పొరపాటే అవుతుంది. సంతోషం, పరిపూర్ణతలకు కొత్త అర్థానిచ్చే నూతన ఆలోచనా విధానాన్ని అవగాహన చేసుకోవాలి. ఈ తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే మన గతాన్ని సంరక్షిస్తున్న సమూహాలకు దగ్గరగా చూడాల్సిన అవసరం ఉంటుంది. పై కవితలో దూరం నుండి వచ్చిన వ్యక్తిని, మొక్క అంటూ, గంజాయి అంటూ రెండు పదాలతో సమతూకం చేశాడు కవి. కానీ, వాస్తవానికి ఇక్కడ అంగీకృత , అనంగీకృత సంస్కృతి కనిపిస్తుంది.

ప్రధానంగా అంగీకృత సంస్కృతిలో వారి ఆచార వ్యవహారాలు తరతరాలుగా వస్తున్న వాటిని అలాగే మారుతున్న జీవితాలకు అనుగుణంగా వారు స్వీకరించే పద్ధతిని అంగీకృత సంస్కృతి అని చెప్పవచ్చు. కానీ, ఇతర ప్రాంతాల నుండి తాండాలో ప్రవేశిస్తే , వారి ద్వారా వచ్చిన సంస్కృతిని అనంగీకృత అని చెప్పవచ్చు. వారితో అంతా తొందరగా కలిసిపోవడానికి ఇష్టపడరు. 'అందుకే కోటమైసమ్మకు/ మేకపోతుని బలిచ్చి' అనే కవితా పంక్తులు సరిపోతాయి.

'కోపం' కవితలో ' లంబాడోనికి/ కోపం వచ్చిందంటే/ అక్షరాలు దిద్దడు/ చెప్పిందే చేస్తాడు/ ఇదే మరి / వారు ఆర్థికంగా/ అడుగున ఉండటానకి కారణం/ కోపమేపరి తగ్గించుకోవాల్సింది/ ప్రతి ఒక్కడూ/ పండు ఉన్న చెట్టుకే/ రాళ్ళు వేసేది/ బంజారా కూడా/ నిండు పండ్లు ఉన్న చెట్టు/ అందకే మరి రాళ్ళేస్తారు అందరూ/ లంబాడోనికి కోపం వచ్చిందంటే/ సాయంకాలానికి/ అర్ధరాత్రి కూసే కోడి/ మెడ తెగిపోయినట్లే/ వేళా పాలా లేకుండా/ కూసే కోడి / ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే/ బాపన పంతులు మంత్రాలకు / చింతకాయలు రాలవు/ అందుకే పటేలా కోపం కొంపముంచుతుంది' అంటూ ఈ కవితలో వివరించాడు.

పూర్వం రాజులు కిరీటాలు ధరించేవారు. ఆ రాజు తన వారసులకి ఆ కిరీటాన్ని వారసత్వంగా అందజేసేవాడు. కానీ, నేడు అందరికీ కిరీటాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ అవి ఎల్లకాలం ఇతరుల పల్లకీలు మోసే వారికి ఎప్పటికి దొరకవు. బతకడం కోసం తన హృదయ వాణిని తొక్కిపట్టి మరొకరి బాణిని తన వాణిగా చేసుకొని కష్టపడి ఆలపించే వారికి హృదయరోదనే మిగులుతుంది. తన అంతరాత్మ పిలుపును, హృదయాంతరాల్లో కదులుతున్న తపన అనే అగ్నిని రాజేసి, మనసుకు ఒక విజన్ కల్పించి,శరీరాన్ని ఆ వైపు పరుగులు తీయించినవారికే ఈ కిరీటం దక్కుతుంది. కిరీటాలకు లోటులేదు. ఈ ప్రపంచంలో ఎంతమంది ఉన్నారో అన్ని కిరీటాలు ఉన్నాయి. ఒకరి కిరీటం మరొకరికి సరిపోదు. ఎవరి కిరీటం వారిదే. వారికోసం ప్రత్యేకంగా చెయ్యబడిరది. మీదైన కిరీటంలోనే మీకు ఆనందం. అదిగాక మరే కిరీటమైనా ముళ్ళ కిరీటమే అవుతుంది. కాబట్టి కోపం తగ్గకపోతే మరింత ఆమడ దూరంలోనే ఉండిపోయే ప్రమాదం ఉందని, వారిలో చైతన్యం రావాలని కవి ఆవేదన కనబడుతుంది.

'కాకుల్ని ఎగరేస్తా' కవితలో 'పావురాన్ని ఎగరేసి/ నువ్వు శాంతిదూతవైనావు/ గుల్లూ గోపురాలూ తిరగి/ పావురాన్ని పట్టుకొచ్చినోన్ని నేను/ నీ అధికారానికి/ మావాల్లు వంత పాడారు/ నువ్వు మా గొంతును నీ గొంతు చేసుకున్నావు/ పావురాన్ని / నువ్వు ఎగరేసినా ఎగరేయకపోయినా/ తన గూటిని కూటిని ఎతుక్కుంటూ/ అది స్వేచ్ఛగా ఎగురుతూనే ఉంటుంది/ మేము / కొత్తగా మీ పై/ కాకుల్ని గద్దల్ని/ ఎగరేస్తాం కాచుకోండి' అంటూ అస్తిత్వాన్ని ప్రకటిస్తాడు.

'సాహిత్యం ఒక భోగ వస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముకంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుపడుతున్నారు' అని శ్రీశ్రీ అన్నారు.పై కవితలో కూడా వారు తమ అస్తిత్వాన్ని తెలియజేస్తున్నారు. రానున్న కాలం మాదే అనే హెచ్చరికను పంపుతున్నారు. 'కొత్తగా మీ పై కాకుల్ని గద్దల్ని ఎగరేస్తాం కాచుకోండి' అంటూ భవిష్యత్ కార్యచరణాన్ని కవి ఆవిష్కరిస్తాడు.

'గ్రహణం' లో 'మాస్టారు గారు/ అచ్చరాలు కొత్తవి/ అందరిలాంటి భాష కాదు నాది/ మీ భాషను మన భాషగా నేర్చుకుంటున్నదాన్ని/ అయినా అందరికంటే/ నా నాలుకేగా మంచిగా తిరిగేది/ నేను రాసే పరీక్ష/ రాత్రి సూర్యుడి లాంటిది/ మాస్టారూ/ సూర్యుడికి గ్రహణం పట్టింది/ గ్రహణం వదలటానికి/ సమయం పడుతుంది/ మీ స్టాండర్డ్‌తో / పోలిస్తే ఎట్లాగు?/ ఒక్కసారి భూమిమీద నిలవండి/ అంతా

కాలంతో పాటే/ నేర్చుకుంటా' అని వారు చదువుపట్ల ఉండే మమకారాన్ని తెలియజేస్తునే... భాష నేర్చుకోవడానికి వుండే సమస్యలు, వారు అంగీకరించే తీరును తమ గొంతుక చెప్పాడు కవి.

సాధారణంగా బడిలో చేరాక తమ భాషకి గుర్తింపు లేకపోవడం, అప్పటి వరకు తన మాతృభాషలోనే మాట్లాడం వల్ల కొత్త భాషలో ప్రావీణ్యత లేకుండా పోతుంది. కొత్త భాషలోకి వచ్చే సరికి తమ అస్తిత్వం ఎక్కడ కోల్పోతనోనని ముందుకు రాకపోవడం ఒక కారణం. నిజానికి గ్రామాలలో ఉండేవారు, గ్రామీణ ప్రాంతాలలో సంచారం చేసేవారు తమదైన ఒక కుల / బృంద భాషలోనే మాట్లాడుతారు. దానిని కులం భాషగా పేర్కొనవచ్చు. అందుకే 'ఒక్కసారి భూమిమీద నిలవండి' అని ప్రశ్నిస్తాడు.

మరొక కవిత 'భూక్' లో ' ఉరికి/ మెడలు సిద్ధమై/ రక్తం కన్నీరు చుక్క అయింది/ తాదా / కాదా/ తొగు చేయండి మరి/ ఆకలి పేగు వాంతి చేసి/ భూక్ లేని మనిషిగా పుట్టాలంటుంది/ చూశారా/ ఈ ఆరాటం/ ఎదుటి మనుషుల్ని/ చంపుకు బతకమంటుంది/ మాయ చట్టం / తన అధికారపు/ నవ్వు అయింది' అంటూ ఆకలిని వర్ణించాడు. లంబాడీల భాషలో 'భూక్' అంటే ఆకలి. లంబాడీల రైతులు లేదా కూలీ చేసుకునే బతికే వాళ్ళు తమ దినచర్యలో భాగం చావు అని చాలా సర్వేలు తెలిపాయి.

ఇటీవల కాలంలో యూనెస్కో వారు ఇచ్చిన రిపోర్టు ప్రకారం చాలా మంది గిరిజనులు ఆర్థాకలితో మరణిస్తున్నారని తెలిసింది. ప్రభుత్వాలు వాటి పై దృష్టి పెట్టాలని చెప్పింది. కానీ, ఇక్కడ 'ఎదుటి మనుషుల్ని/చంపుకు బతకమంటుంది/మాయ చట్టం' అంటూ వాస్తవాన్ని ఎండగట్టాడు.నిజం కూడా అదే. ఈ కాలంలోనైనా ప్రభుత్వాలు చేసే పనికూడా ఇదే.

'నసాబ్' కవితలో ' మా నాలుకలు కోసి/చెవుల్లో సీసం పోసినా?
మీ నాలుకలకు అచ్చరాలిచ్చి/చెవులకు మోతలిచ్చింది మేమే
మన ఇద్దరం సర్కారు జీతగాల్లం/ మరెందు కింత వింత కసి?
మీ అగ్రహారాలు అంత: పురాలు/ మేము అడిగామా?
మా ఆలోచన్లు మోకాల్లలోనే ఉంచి
మెమోలు రోజుకొకటి పంపుతున్నావు/కాని ప్రతి మెమో తూర్పు వెలుగై
తెలివితేటల ఈజ్ అవుతుంది/నీ మెమోల వరద అపకపోతే.....
రచ్చబండ కాడ నసాబ్ పెట్టిస్తాం" ఇందులో కులం అనే సమస్యను అంతర్లీనంగా చిత్రించాడు.

గిరిజన రాజకీయ వ్యవస్థ నాగరికత రాజకీయ వ్యవస్థకు విరుద్ధంగా ఉంటుంది. గిరిజన తెగల్లో కేవలం గూడెనికి గాని, మొత్తం ప్రాంతానికి గాని కలిపి రాజకీయ వ్యవస్థ ఉంటుంది. గిరిజనుల్లో ఉండే రాజకీయ వ్యవస్థ అత్యంత బలంగా ఉంటుంది. వాళ్ళు అన్ని నియామలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుంది. లేకపోతే తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ పంచాయితీలు, కుల పంచాయితీ రూపంలో వివిధ వ్యవస్థలు పనిచేస్తుంటాయి. గూడెంలోని ఒక వ్యక్తి నేరం చేసినట్లయితే అతడికి గిరిజన వ్యవస్థలో రెండు రకాలైన శిక్షలుంటాయి. ఒకటి గూడెం దేవత పైన ప్రమాణం చేయడం, ఆ తరువాత కఠిన శిక్షకు గురికావడం అనే రూపంలో ఉంటాయి. అందుకే కవి బహిర్గతంగానే రచ్చబండ కాడా నసాబ్ పెట్టిస్తా అంటున్నాడు.

తరతరాలుగా అడవి బిడ్డలు పడుతున్న బాధలు కూడా ఇవే. మనిషి, మనిషిలోనే అంతార్యం ఉంటుంది. ఆలోచనలో మార్పు. చూసే కోణం ఒక్కటైనా, తీసుకొనే పద్ధతిలో వ్యత్యాసం వస్తుంది. ఇద్దరూ ఒకే చోట పనిచేస్తున్న ఏమీ రాదు అనే ముద్రను ముందుగానే వేస్తున్నాడు. గిరిజనల అమాయకత్వం అవతలి వల్లకు లాభాదాయకంగా మారుతుందనే కోణాన్ని చూపించాడు.

కులమాతాల సుడిగుండంలో చిక్కుకోపోవుద్ద' అంటూ సినీ కవి అన్నట్లు అవి పాటలకో, పుస్తకాలకో పరిమితమౌతున్నాయి. వాటిని ఆచరించే వారు లేరు. కులమాతలన్నీ మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అన్న గురజాడ మాటలు కూడా ప్రాచీనమే అయిపోయాయి. వాటిని కేవలం మీటింగ్‌లోనో, గోడల పైన అత్యంత ఆదరణ పొందిన పంక్తులను రాయడానికి వాడతున్నట్లు కనిపిస్తుంది. అదే ఉంటే కవి ఆ మాటలు రాయడానికి వీలులేదు.

'ఒక మనిషి గొప్పవాడు కాకపోయినా స్వతంత్రుడై ఉండగలడు. కాని ఏ మనిషి స్వతంత్రుడు కానిదే గొప్పవాడు కాలేడు' అన్న ఖలీల్ జిబ్రాన్ వ్యాక్యాలు ఈ దేశంలో ఎంతమేరకు చెలామణిలో ఉన్నాయి? అనేది ప్రశ్న. అందుకే కవియే నసాబ్ ను పెట్టిస్తా. ఒక చక్కని వేదిక కోసం, అందులో మాట్లాడడానికి వక్తల కోసం ఎదురుచూస్తున్నారని సంకేతాన్ని తెలిపాడు.

**<u>సాంఘిక చైతన్యంతో కూడిన కవితలు:</u>**

వ్యక్తే సంఘ జీవి అన్నట్లు...వ్యక్తి ఆలోచన నుండి సాంఘికీకరణ పుట్టాలి. లేకపోతే అది వ్యవస్థను వేరే మార్గాంలో తీసుకెళ్ళే అవకాశం ఉంది. రూసో లాంటి మహనీయులు 'నేను ఈ వ్యవస్థలో ఉండలేనేమో' అని అభిప్రాయపడ్డాడు.

సమాజంలో పేరుకొని పోయిన దురాచారాలను రూపుమాపి, మానవతా విలువలను పెంపొందించే దిశలో వచ్చిన కవితలు ఇందులో ఉన్నాయి. నిజానికి కవులందరూ మౌలికంగా ఈ లక్ష్యంతోనే రచనలు చేస్తారు. మానవీయ విలువల స్థాపన కవిత్వం యొక్క పరమప్రయోజనమని కవులందరూ అంగీకరించే విషయమే.

'ఆర్తనాదం' లో కూకట్‌పల్లి నట్టనడి బజార్లో
బిడ్డ జాడల్ని వెతుకుతున్న తల్లి/ఆర్తనాదాలు
మా చెవుల్లో మ్రోగుతూనే ఉన్నాయి/నా బిడ్డ జాడ కాస్త చెప్పండన్న
ఆమె మాటలు మమ్మల్ని/ నడి బజార్లో నిలబెడుతూనే ఉన్నాయి
కడుపు నిండని వాళ్ళం కదా మేము/సుఖం ఎరగని శరీరాలు కాదు మావి
ఢిల్లీ కోట మీద/మా జాతి నాయకుడు/ మా కులపోడు 'హమర్ జాతేవాళ్'
ఆ జండాని ఎగరేస్తుంటే/ ఆ గీతాన్ని పదేపదే పాడుతుంటే
గుండెల్లో కలుక్కుమంటుంది' అంటూ చరిత్రలోకి వెళ్ళిపోతాడు. భారతదేశాన్ని పరిపాలించిన రాజుల్లో గొప్ప వాళ్ళు చాలామంది ఉన్నారు. వారిలో పృథ్వీరాజ్ చౌహాన్ చివరి హిందూ రాజు కూడా. ఈ కవితలో మాజాతి నాయకుడు ...అంటూ కవి అనడంలో అర్థం కూడా ఇదే. బంజారాలు గ్రామాల్లో ఒక కట్టుకథను నిత్యం చెప్పుకుంటుంటారు. అదేమిటంటే ఒకప్పుడు రాజులుగా ఉన్న వాళ్ళు ముస్లిం దాడుల్లో అడవుల్లోకి వెళ్ళిపోయారని, అలా పోకుండా ఉంటే ఇప్పుడు చాలా చోట్లు అధికారంలో గిరిజనులే ఉండేవాళ్ళని అంటుంటారు. ఆ ఉద్దేశంతో కవి ఇక్కడ 'ఢిల్లీ కోట మీద మా జాతి నాయకుడు' అని ప్రతీకాత్మకంగా చెప్పడం కవికి చరిత్ర పట్ల ఎంతో దూరదృష్టి ఉందని ప్రకటించాడు.

భూస్వామ్య సంస్కృతిలో కొన్ని మంచి, మానవీయాంశాలు కూడా అత్యాధునికాంనంతరం వాదంలో నామారూపాలు లేకుండా అంతరించి పోతున్నాయి. ఇప్పుడు సమాజం మన చేతుల్లో లేదు. కనబడని హస్తాలు నడిపిస్తున్నాయి. అంతరించిపోతున్నది కాళ్ళకింది నేల. కలలు కూడా కొత్తవి రూపొందడం లేదు. పాతవెలా రాస్తారు? అవును కలలకి ఆస్కారంలేదు. భవిష్యత్తు అంధకారం. జీవితం సంక్లిష్టం. కాబట్టే వాళ్ళు రాయాలి. తిరిగి రాయాలి. రాజ్యాన్ని పూర్వ వైభవం తెవాలిసిన అవసరం ఉంది. లేకపోతే అది చరిత్రలో ఒక పేజీలుగానే మిగిలిపోతుంది.

తుపాకి' లో 'రాలిపోయిన చుక్కలన్నీ/ భూమి మీద పుట్టి/ ప్రజా వ్యతిరేకులకు / తుపాకులతో కొత్త సంతకాలు/ చేయడానికి గురిపెట్టి ఉంచారు/ వందేమాతరం, అల్లూరి సీతారామరాజు/ కొమురం భీము/ మన చుట్టూ తిరుగుతూ ఉన్నరు/ దళాలను తయారు చేస్తూనే ఉన్నారు/ ఇక చావో బ్రతుకో/ నదురబోయి కలగందాం/ కలగని కార్యాన్ని చూపడదాం' కవి ఎంతో ఆశతో జీవిస్తున్న తీరు ఆమోఘం. కవిలో ఒక ఆవేధన కనిపిస్తుంది.

సమాజం నిత్యం మంచి జరగాలనే కోరుకుంటుంది. ఎవర్ని కూడా కావాలని జనజీవన స్రవంతికి దూరం చేయాలనే కోరిక ఉండదు. కాలం అలా చేస్తుంది. రాలిపోయిన చుక్కలన్నీ ...అంటూనే...తిరిగి సమసమాజం ఉండాలనే కోరుకోవడం వెనుక ఆశా దృక్పథం కనిపిస్తుంది.

ఆధునిక కాలంలో ప్రపంచమంతా పోరాటాలు జరుగుతున్న దశలో ఒక ప్రాంతంలో ఒక స్తబ్దత ఉన్నా అంతర్లీనంగా పరోక్షంగా ఒక రచన మీద ఎలా ప్రతి ఫలిస్తుంది. ఈ జీవన తాత్త్వికతే కవితల్లో కనిపిస్తుంది. ఒక బ్రాడ్ డెమొక్రటిక్ స్పిరిట్ అంతర్వాహినిగా కవితల్లో చోటు చేసుకుంది.

భారత స్వాతంత్ర్య సంగ్రహంలో అల్లూరి, కొమురం భీం లాంటి నాయకులు తమ ప్రాణాన్ని ఫణంగా పెట్టి తన ప్రాంతం కోసం, తనను నమ్ముకున్న వారి కోసం ప్రాణ త్యాగాలు చేయడం చాలా

గొప్ప విషయం. వారి స్ఫూర్తి ఇప్పటి దాకా కొనసాగడంలో వారు ప్రజలతో ఎంత మమేకమై ఉండిపోయారో అర్థమౌతుంది. ఈ యుద్ధం ఎవరెవరికీ మధ్య జరుగుతోంది. తుపాకులకు స్వస్తి పలకండని గన్నును పెన్ను చేయమని ఆధునిక సంకేతాన్ని కవి చెప్తాడు.తద్వారా శాంతి పతాకాన్ని ఎగరవేయవచ్చు అని భావిస్తున్నట్టు మరొక కవితలో ఇలా..."పావురాన్ని ఎగరేసి/ నువ్వు శాంతి దూతవైనావు/ గుల్లూ గోపురాలూ తిరిగి/ పావురాన్ని పట్టుకోచ్చినోచ్చి నేను' అంటూనే 'నువ్వు మా గొంతును నీ గొంతు చేసుకున్నావు/ పావురాన్ని / నువ్వు ఎగరేసినా ఎగరేయకపోయినా/ తన గూటికి కూటిని ఎతుక్కుంటూ/ అది స్వేచ్ఛగా ఎగురుతూనే ఉంటుంది/ మేము కొత్తగా మీ పై కాకుల్ని గద్దల్ని ఎగరేస్తాం కాచుకోండి' సమసమాజ భవిష్యత్ కనిపిస్తుంది.

దేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత పరిపరి విధాలుగా మార్పు చోటుచేసుకున్నది. కాలక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాను అమలు చేయడం మొదలు పెట్టారు. సిద్ధాంతాలు ఉన్న కొన్ని సందర్భాల్లో న్యాయం జరగని పరిస్థితి కూడా కనిపిస్తుంది. కవి 'దుగ్గు' కవితలో 'గిరిజన జీవులం/ లంబాడా తండావోల్లం/ దేశ సొతంత్రానికి/ రాజరికాన్ని బలిచ్చినోల్లం/ రిజర్వేసన్ కోసం / పడిగాపులు కాస్తున్నోల్లం' అంటూ కవి వర్ణిస్తాడు.

నేటి పరిస్థితి కొన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నాట్టు తెలుస్తోంది. స్వాతంత్రం...మా రాజ్యాన్ని మేమే పాలించుకుంటాం...మా పన్ను మేమే కట్టుకుంటాం...అనే ధోరణి చాలా మందిలో ఉండేది. కాలనుక్రమంలో ఆ విషయం పట్ల చాలా తక్కువ మందికే అవగాహన ఉంది. వాటికి అతీతంగా రాజకీయాలు ఏర్పాడ్డాయి. ప్రజలు ఓటు వేయడానికి బదులు, ఓట్లనే కొనే స్థాయికి దేశం చేరుకుంది. వాటిలో మార్పు రానంత కాలం కవి ఏదైతే కలలు కంటున్నాడో అవి నేరవేరే అవకాశం లేదు. అందుకే ' అరచేత ఆయుధ మవుతున్నై / బతుకును బలితీసుకున్న ఆయాల్టి ఆ మాట/ ఇంకా గుర్తుగానే ఉంది' అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాడు.

**సంస్కృతిని తెలిపే కవితలు:**

'నసాబ్' కవితలో సంస్కృతిని తెలిపేవి లేకపోలేదు. వాటిలో కొన్ని పరిశీలిస్తే...'అడవి అంబేడ్కరులం' లో 'లంబాడోన్ని నేను/ నాదళియ సద్దిబువ్వ/ జీవాలు ఎండుతునకలు/ కాళ్ళు తలకాయలు/ కాంద జారేర్ బాటీ/ కారపు మెతుకుల్తో/ నీసు తిన్న జాతి మాది/ నువ్వు కూసేకూతల/ రిజర్వేషన్ల స్వేచ్ఛల మతలబు/ తెలియనోళ్ళం/ ఊరిపొలిమేరలం/ తండా కేథారీలం/ పుట్లు పండిరచి పొట్టకి/ గంజి నీళ్ళు తాపినోళ్ళం/ దొర చూపుకి బయపడి/కొత్తగుడ్డకి బురదపూసి తొడిగినోళ్ళం/ రేయ్ పెద్దకుల పెద్దమ్మల్లారా/ మా వాళ్ళతోలు పనిలో/ గూటం కొట్టే కొలువు ఇప్పిస్తాం రండి/ నువ్వు మా బతుకు బుగ్గి చేయాలనుకుంటే/ నిన్ను ఎందుతునకను నమిలినట్లు నములుతాం/ మేము ఊరిదారుల్ని చెక్కుతున్న / అడవి అంబేద్కరులం' అంటూ వారి ఆహార నియమాలు తెలిపాడు.

లంబాడీల ఆహార విషయంలో జారేర్ బాటీ అనేది ప్రపంచ ప్రసిద్ధి పొందింది. నేడు ఆ ఆహారం ఎవరి దగ్గరి నుండి వచ్చిదో వారికి దక్కకుండా పోతుంది! పోవడానికి రెడీ గా ఉంది. ఎవరైనా చుట్టాలు ఇంటికి వస్తే ఆరోజు జారేర్ బాటీ ఉండాల్సిందే. మేముగా తినే ఆహారాన్ని బహిర్గతం చేశాడు. ఆధునిక కాలంలో టెక్నాలజీ యుగంలో దాయడానికి ఏమీ లేకుండా బతుకుతున్నాం. కానీ, అంబేద్కర్ సిద్ధాంతం కోసం నూతన కోణం రావడం చాలా చైతన్యవంతం.అందుకే 'బర్చి' కవితలో 'పెద్దరికం/ పొయ్యి కింత మండుతుంది/ నా కసి/ కుండలో సలసలకాగుతుంది/ నీరు ఆవిరై/ పొయ్యి రాజేసిన/ పెత్తందారుడా!...అంటూ సమాజంలో ఎదురౌతున్న సంఘటనలను చిత్రించాడు.

నిచ్చెనమెట్ల సమాజంలో అందరికీ సమాన అవకాశాలు రావాలనేదే అంబేద్కర్ సిద్ధాంతం. సిద్ధాంతం అవతల నుండి మాట్లాడుతున్నప్పుడు ఆ విషయాలు మనకు కనిపించదు. అందుకే పై కవితలో నీరు ఆవిరై, పొయి రాజేసిన' మాటలు అందుకు నిదర్శనం. ఫలాలు దక్కనప్పుడు చివరికి మిగిలిలే ఆవిరైన మాటలు, రాజేసిన శత్రుత్వాలు తప్ప, ఇంకా ఏమీ ఉండదనే చరిత్ర వాస్తవం.

'నిజంగా మావోడివే' కవితలో 'నిన్న మొన్నటి వరకూ/ మావోడివే అనుకున్నాం/ నిజంగా మావోడివే/ అయితే../ మార్పు జరిగింది నీలో/ అధికారం రిజర్వేషన్తో' అంటూ సామాజికతను తెల్పాడు.

'పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాల పరిణామంలో ప్రపంచీకరణ గుణాత్మకంగానే విభిన్నమైన దశ. ద్రవ్య పెట్టుబడుల పెరుగుదల అపారంగా వుండి అంతర్జాతీయతను సంతరించుకోవటం యీ దశ ప్రత్యేకత. బ్రహ్మాండమైన యీ పెట్టుబడి మొత్తాలు సత్వర లాభాలను

ఆశిస్తాయి' అని నేటి ప్రపంచధోరణిని తెలిపారు. పై కవితలో నిజంగా మావోడివే అనే ధోరణి...అనేక అంశాల పట్ల ఉన్న సంకుచిత్వాన్ని తెలియజేస్తుంది. నిజమైన సైద్ధాంతిక అంశాలను లోతుగా చూడాల్సిన అవసరం ఉందని కవి చెప్పకనే చెప్పాడు.

సంస్కృతిలో భాగంగా ఆహార నియమాలను వివరించారు. 'ఆకలి' రొట్టె' కవితలో వాటి గురించి చిత్రికరించారు.

'ఆకలి' లో 'ఆకలి మంటలు/ భగభగమని మండే మంటలు/ మాడిన లంబాడి పేగు/ అమ్మ ఆకలి అని అరిచే పసి కూనకు/ పట్టేడన్నం పెట్టలేకుంది/ బువ్వలేక పాలురాక ఏమి తినాలో తెలీక/ బజారుల్లో మన పొలాన్ని దోరోనికి/ తాకట్టు పెట్టి పరిగేరుకున్న/ పావుసేరు ఒడ్లు/ కోమిటి వెంకటన్నకు అమ్మినట్లు/ నవ మాసాలు మోసి/ రెండు ప్రాణాలు పోగొట్టుకుంటూ/ మనదేశ బ్రోకర్ల ఆకలి తీర్చడానికి/ మన సంతతిని పరదేశానికి బహుకరిస్తున్నాను/ లంబాడిగా నేను మన దేశాన్ని ఏమి ఆసించకుండా /చంటి కేకలు వేస్తూ పుట్టగానే విమానం ఎక్కి/ గ్రీన్‌కార్డ్ హోల్డర్ అవుతున్నాను' అని ఆక్రోశాన్ని చెప్తాడు కవి.

ప్రపంచీకరణలో చివరికి సంస్కృతి కూడా సరుకుగా మారింది. సంస్కృతి సమాజంలో అంతర్భాగం. సమాజంతో పాటు నిరంతరం పరిణామం చెందుతుంది. ఆదిమ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ, పెట్టుబడిదరీ వ్యవస్థలకు సంబంధించిన సాంస్కృతిక రూపాలు, విలువలు కూడా ఆయా వ్యవస్థలకు తగ్గట్టుగా ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఒకే వ్యవస్థలో కూడా భాషా, మతం, వాతావరణం, వారసత్వం వంటి అనేక ఇతర అంశాల ప్రభావం వల్ల ఈనేక వైవిధ్యాలు ఏర్పడతాయి' అంటూ ప్రపంచ సంస్కృతి గూర్చి వ్యాఖ్యానించారు.దీనిలో ఆహారం కూడా ప్రధాన అంశంగా మారింది. రాను రాను వాటిలో మార్పులు, చట్టాలు రావల్సిన అవసరం ఉంది.

వ్యవస్థలో ఆకలి అనేది చాలా కీలకమైనది. ఐతే వాటిలో రకాలు లేకపోలేదు.

౧. ఆకలితో మరణించేవారు

౨. ఆకలిని తెచ్చుకునేవారు

౩. ఆకలి లేక మరణించేవాళ్ళు

౪. ఆకలి కోసం సర్వం త్యాగం చేసేవారు...ఇలా మొదలైన అంశాలుగా చెప్పవచ్చు. పూర్వకాలంలో రాజులు యుద్ధం చేసేటప్పుడు వాటికి మొదట ప్రాధాన్యత ఇచ్చేవారు. వాటి కోసం అన్ని ఏర్పాట్లు చేసుకునేవారు. కానీ నసాబ్' లో ఆకలి కవితలో తిండి కోసం కన్న పేగును అమ్ముకునే స్థితికి రావడం అంటూ చిత్రీకరించాడు.

సాధారణంగా అప్పుడప్పుడు పిల్లల్ని అమ్మిన లంబాడీ స్త్రీ అంటూ పేపర్లో వస్తుంది. అమ్మడానికి కారణాలు వారి ఆకలి. వారు అమ్మడానికి కారణాలు అవే అయినప్పుడు దాన్ని ఎవరు నివారించాలి? ఎందుకు నివారించాలి? ఎలా నివారించాలి? అనే ప్రశ్నలు వస్తాయి. సాధారణ స్థాయిలో మార్పు వస్తే వాటికి సమాధానం అక్కడే దొరకుతుంది. కనీస అవసరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించింది. వాటి ఫలాలు వారి వరకు చేరితే కోమటి వెంకన్న పాత్ర మనకు మళ్ళీ కనిపించదు. ఈ దిశగా వ్యవస్థ మారాలి, వ్యవస్థలో ఉన్న లోపాలు సవరించాలి, గిరిజనుల్లో కూడా మార్పు రావాలి, ఆలోచనల్లో మార్పు రావాలి.

**<u>శ్రమ దోపిడి 'సంస్కృతి'</u>**

భూతలంపై సంచరించు ప్రతి జీవరాసి, సంఘంగానే జీవిస్తాయి. సంఘం లేక గుంపుగా జీవించడానికి ప్రకృతి కూడా సహకరిస్తుంది. మానవుడు, జంతు పశుపక్ష్యాదులు పొట్టపోసుకోవటానికి శ్రమిస్తాయి. శ్రమ లేకుండా జీవించడం కేవలం ఉన్నత వర్గానికే సాధ్యం అవుతుంది. లేదా మధ్యతరగతి కుటుంబాల్లో వారసత్వ సంపద వస్తే అలా జీవించడం చేస్తారు. ప్రతి వాడు ఏదో ఒక రూపంలో కష్టపడాల్సి ఉంటుంది. కష్టపడడం మనిషి లక్షణం. శ్రమ మనిషిని బానిసత్వం నుండి విముక్తి చేస్తుంది. శ్రమకు తగిన ప్రతిఫలం రావటం లేదనేది ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు వస్తున్న సిద్ధాంతం.

'రొట్టె' కవితలో ' సోయిలేని లంబాడీలం/ ఒక మనిషి ఇంకొక మనిషిని/ దోచుకుని బ్రతుకుతున్నారు/ అని తెలియని అమాయకులం/ శ్రమ దోపిడి అంతా/ మాకు తెలిసిన పని చేస్తూ/ రూకలు మిగలనోళ్ళం/ శ్రమతో చెమట చుక్కలతో/ సముద్రాన్ని సృష్టించగలం/ శ్రమతో నూకలు పుట్టించి/ శక్తితో జొన్నలు సృష్టించి/ ఇసుర్రాయిలో విసిరేసి/ మూడు రాళ్ళ గ్యాస్/ మూడు నిమిషాల్లో

తయారుచేసి/ మూతితో వెలిగించి/ మిర్యాలగూడ సిక్కులోళ్ళ/ బజారులో కొన్న రొట్టెపెంక/ ఎండిపోయిన కట్టెలమోపు/ పోయికిందే కాలిపోతానంది' అంటాడు.

శ్రమను గుర్తించే కాలం రావాలనేది అంతిమ నిర్ణయం. దాని కోసం అనేక పోరాటాలు, అనేక మేథస్సుల సదస్సులు నిర్వహించారు. కానీ, ఎక్కడేసిన గొంగ్గడి అక్కడే అన్నట్టు ఉండిపోయింది.పై కవితలో శ్రమతో తమకు తెలియకుండానే అనేక పనులు చేస్తున్నా ,ఇది సరైనది ? కాదు అనే చెప్పేవారు లేకపోవడం శోచనీయాంశం. పైగా శ్రమ దోపిడితో పాటు, తమ భోజనాన్ని కూడా భోజనీకరణం చేశారు.

**భారతీయ స్త్రీ – వికాసం**

'శరీరం' కవితలో 'నేనిప్పుడే పుట్టినదాన్ని కాదయ్య/ వయసుడిగిన దశలో ఉన్నదాన్ని/ ఈ మధ్యలో ఎన్ని దశలు! / అప్పుడా మీకు నేనే ఛీ ఛీ..కొట్టింది/ ఆకలికి విచ్చుకునే శరీరం మాది/ మా శరీరాలను వలకబోశాము మీ కోసం/ మీ పెండ్లాలు అలిగినప్పుడల్ల/ మా జీవితం మీకు సెంటుసీసా అయింది/ ఆమె..ఛీ...పోరా అన్నప్పుడల్లా/ మా అందాన్ని/ మా మాటల్ని/ మా గొంతుల్ని/ భూమి నుండి ఆకాశానికి ఎత్తేశావు/ మాకు రిటైర్‌మెంట్ గ్రట్రా ఉండవు/ అవకాశం ఇప్పిస్తావా..?/ అయితే పెన్‌షన్ నైనా ఇప్పించు/ మేము చేసేది తప్పేనంటివా?/ ఆ తప్పు చేయిస్తున్నది మీరే కదా!/ ఈ దేశంలో డ్వాక్రా స్కీమ్లు/ రకరకాల పేర్లతో / నడుస్తున్న సంస్థలు/ మా కంటికి చీకటిమయ మయ్యాయా?/ రాజకీయ రాజులు/ సంతోషంగా ఉన్నా, దుక్కంలో ఉన్నా/ మా గుడిసెలే వాళ్ళకు/ అద్దాలు మేడలైనాయి/ వంట్లో రక్తం ఉన్నన్ని రోజులు' అంటూ స్త్రీ శరీరం వస్తువుగా మారిన దుస్థితిని చెప్పారు.

స్త్రీ వేశ్యగా మారడం, వేశ్యగా తన బాధను వ్యక్తం చేయడం స్త్రీ వాద సాహిత్యంలో ఎప్పుడో చిత్రీకరించారు. స్త్రీ బాధను అంగాంగ వర్ణనను స్త్రీలే తమ గొంతుకగా చెప్పారు. ఆ ఉద్దేశంతో 'నీలిమేఘాలు' 'గురిచూసే పాడే పాట' కవితా సంకలనాలు వచ్చాయి. స్త్రీ, స్త్రీగా చెప్పే విజన్ లో వాస్తవస్థితి ఉంటుంది. మహెూజబిన్ గారు కూడా వేశ్యల గురించి అద్భుతమైన కవితలు రాశారు.

నసాబ్' లో కూడా కవి బంజార స్త్రీ గూర్చి చెప్పారు. గిరిజన స్త్రీని శారీరకంగా అనుభవించి, చివరికి బజార్లో విడిచి, చంపేసిన దుస్థితి కూడా ఉంది. అన్ని సుఖాలకు నిలయమైన తన శరీరం చివరికి చెత్తకుండి దగ్గర అనడం వారి సామాజిక, ఆర్థిక పరిపుష్టిని తెలియజేస్తుంది. అందుకే 'అందం అంతా/ పాపం/ చెత్తకుండీలో/ కాలిన తోలు బూడిదైంది" అంటూ మరొక చోట అంటాడు.

చివరికి 'సోది' కవితలో ' చెట్టు క్రింద పోలేరమ్మ చెప్పు/ గుట్టక్రింద గొరమ్మ చెప్పు/ ఓ...దొరసాని/ నీ పెనిమిటి చాలా/ తిరుగుబోతు/ గిడపోయిరా అంటే/ గాడపోయి వస్తడు/ దొరసాని.....సై..సై.. అంటారు/ నిన్నూ ఉన్న రాజ్యాన్ని/ పోలేరమ్మ/ బాగా చూస్తుంది/ దొరసాని/ జీతగాళ్ళను/ తక్కువగా చూడకు/ అందరిని జాగ్రత్తగా/ చూసుకో/ చల్లగా ఉండు/ పోలేరమ్మ సోది/ సోది చెపుత/ ఉన్నది ఉన్నట్లు చెపుత' అంటూ గిరిజన స్త్రీని ఆవిష్కరింపచేసాడు కవి.

సాధారణంగా సోది చెప్పే పద్ధతి గిరిజనుల్లో ఒక భాగం. దీన్ని కూడా అందరూ చెప్పలేరు. కొన్ని తెగల వారు మాత్రమే అనుసరిస్తారు. ఈ పద్ధతి కూడా ప్రపంచీకరణ చెద్ది, చివరికి వారికి దక్కకుండా పోయింది. ఇప్పుడు సోది చెప్పే పద్ధతి అంగాంగ మార్కెట్లో చెలామణిలో ఉంది.చెప్పే మనుషులు, తరీకా మారింది. సోది చెప్తున్న గిరిజన స్త్రీ మాత్రం రోడ్డు మీద దిక్కులు చూస్తే ఏమీ చేయాలో తెలియక పల్లీలు అమ్ముకుంటుంది.

**చివరగా...**

అన్ని రకాల సమస్యలను పంచాయితీలోకి తెచ్చి నడిబొడ్డున కూర్చున్నాడు కవి. నసాబ్ చెప్తే అందరికి ఒకేలాగా ఉండాలని బోరున ఏడ్చాడు. అన్నింటికి తీర్పు మనకోసమే వదిలేశాడు. తీర్పు కోసం నవసమాజం కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రకృతి పరంగా గానీ, సంస్కృతీ పరంగా, సాంఘిక పరంగా, రాజకీయంగా అనేక విషయాల పట్ల ఒక కోణాన్ని సమానంగా పంచి పెట్టడని వేడుకుంటున్నాడు. అందరం కలిసి ఆ పంచాయితీలో కూర్చొద్దాం రండి. పోయేదేమి లేదు. తెలుగు సాహిత్యంలో ఒక సముచిత స్థానాన్ని తెచ్చుకున్న కవిత సంకలనం 'నసాబ్'. నసాబ్ జిందాబాద్. రచ్చబండ కోసం ఎదురుచూస్తూ ఉంటాను. అందరం కలిసి వచ్చే వరకు నసాబ్‌ను ముందుకుపోనీయకు.

**ఉపయుక్త గ్రంథాలు:**

౧. రవి, తెలకపల్లి.2014. ప్రపంచీకరణ సంస్కృతి. ప్రజాశక్తి బుక్ హౌస్
౨. రమేష్, జరుపుల. 2018. తెలుగు నవల గిరిజన జీవన చిత్రణ
౩. పంతులు, వడ్త్య.2008. నసాబ్. మేగ్యాతండా ప్రచురణలు.
౪. లియో హూబర్ మన్.1997. మానవుడు సంపద సమాజం. ప్రజాశక్తి బుక్ హౌస్